సాక్షి
అనకాపల్లి
శనివారం ׀ 5 ׀ జులై ׀ 2025

అల్లూరి కీర్తి..

భావితరాలకు స్ఫూర్తి



నర్సీపట్నంలో అల్లూరి కాంస్య విగ్రహావిష్కరణలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్



కృష్ణదేవిపేట గ్రామం నుంచి పార్కుకు ర్యాలీగా వస్తున్న విద్యార్థులు

నర్సీపట్నం/గొలుగొండ: అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు జయంతి శుక్రవారం జిల్లా అంతటా ఘనంగా జరిగింది. అల్లూరి విగ్రహాలు, చిత్రపటాల వద్ద పూలదండలతో నివాళులర్పించారు. స్ఫూర్తివంతమైన ఆ విప్లవ వీరుడి గాథను స్మరించుకున్నారు. గొలుగొండ మండలం కృష్ణదేవిపేట (ఏఎల్‌పురం) ప్రాంతంలోని విద్యా సంస్థల్లో చదువుతున్న చిన్నారులు, ప్రభుత్వ ఉద్యోగులు సుమారు రెండు కిలోమీటర్లు ర్యాలీ నిర్వహించి పార్కుకు చేరుకున్నారు. అక్కడి అల్లూరి సమాధికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత, కందుల దుర్గేష్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా నివాళులర్పించారు. అల్లూరి కాంస్య విగ్రహానికి, అల్లూరి తల్లి నారాయణమ్మ విగ్రహానికి పూలమాలలు వేశారు. నర్సీపట్నంలోని పెదబొడ్డేపల్లిలో అల్లూరి కాంస్య విగ్రహావిష్కరణ ఘనంగా జరిగింది. రూ.12 లక్షల వ్యయంతో తొమ్మిది అడుగుల ఎత్తయిన విగ్రహాన్ని నర్సీపట్నం క్షత్రియ పరిషత్ సమకూర్చింది. విగ్రహం చుట్టూ ఉన్న ప్రాంతం సుందరీకరణకు మరో రూ.13 లక్షలు వ్యయం చేశారు. క్షత్రియ పరిషత్ అధ్యక్షుడు గణపతిరాజు సూర్య బంగార్రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు కందుల దుర్గేష్, కొల్లు రవీంద్ర, ఎంపీలు సీఎం రమేష్, కలిశెట్టి అప్పలనాయుడు హాజరయ్యారు. అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ విగ్రహం ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని అల్లూరి సీతారామరాజు సెంటర్‌గా నామకరణం చేస్తున్నట్లు ప్రకటించారు. విగ్రహం వెనుక భాగంలో 50 అడుగుల ఎత్తు గల జాతీయ జెండా, విగ్రహానికి ముందు భాగంలో వాటర్ ఫౌంటైన్ ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ డి.వి. సూర్యనారాయణరాజు, కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా, ఆర్డీవో వి.వి.రమణ, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, క్షత్రియ పరిషత్ ఉపాధ్యక్షుడు రాజా సాగి సత్యనారాయణరాజు, కార్యదర్శి బుద్ధరాజు చక్రపాణి రాజు, సంయుక్త కార్యదర్శి దాట్ల రవివర్మ, కోశాధికారి జంపన నాగేంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి డీఐఈవోగా వినోద్‌బాబు



పరవాడ: అనకాపల్లి జిల్లా ఇంటర్ ఎడ్యుకేషన్ అధికారిగా పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వినోద్‌బాబుకు అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగిస్తూ ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఐఈవోగా అదనపు బాధ్యతలు స్వీకరించిన వినోద్‌బాబు పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రస్తుతం పనిచేస్తున్నారు. అనకాపల్లి జిల్లా ఇంటర్మీడియట్ అధికారిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

అనకాపల్లి తలసరి ఆదాయం రూ.2 లక్షలే

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర అసంతృప్తి



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర

తుమ్మపాల: విశాఖ జిల్లా తలసరి ఆదాయం రూ.4 లక్షలు ఉంటే, అనకాపల్లి రూ.2 లక్షలకే పరిమితం కావడం బాధాకరమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో స్వర్ణాంధ్ర-2047లో భాగంగా జిల్లా దార్శనికత కార్యాచరణ ప్రణాళికపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం లేని రాష్ట్రాన్ని సాకారం చేయడమే విజన్ 2047-పి4 కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. మండల స్థాయిలో విజన్ డాక్యుమెంట్స్ రూపొందించాలన్నారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా బంగారు కుటుంబాలను, మార్గదర్శులను గుర్తించాలన్నారు. సమావేశంలో ఎంపీ సీఎం రమేష్, కలెక్టర్ విజయ్‌కృష్ణన్, శాసన సభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, విజయ్‌కుమార్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డీఆర్వో వై సత్యనారాయణ, ఆర్డీవో షేక్ అయిషా, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పసుపు గోదాం దగ్ధం

- నర్సీపట్నం మార్కెట్ యార్డులో ప్రమాదం
- రూ.కోటి ఆస్తి నష్టం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది



పసుపు గోడౌన్ నుంచి ఎగిసిపడుతున్న మంటలు

నర్సీపట్నం: పట్టణంలోని పెదబొడ్డేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో అగ్నిప్రమాదం జరిగింది. శుక్రవారం ఉదయం పసుపు గోదాం నుంచి మంటలు, దట్టమైన పొగలు రావటాన్ని యార్డులోని వారు గుర్తించారు. విషయం తెలుసుకున్న గొడౌన్ లీజుదారుడు, పసుపు వ్యాపారి పెదిరెడ్ల గోవింద్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన యార్డుకు చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఎంతకూ మంటలు అదుపులోకి రాకపోవడంతో రావికమతం నుంచి మరో ఫైర్ ఇంజన్ రప్పించారు. జిల్లా ఫైర్ అధికారి వెంకటరమణ, నర్సీపట్నం ఫైర్ ఆఫీసర్ అప్పలస్వామి పర్యవేక్షణలో ఫైర్ సిబ్బంది శ్రమించి మధ్యాహ్నానికి మంటలను అదుపులోకి తెచ్చారు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, ఏడీఎం రవికుమార్, సెక్రటరీ భువనేశ్వరి యార్డుకు చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించారు. గోదాంలో నిల్వ చేసిన 60 టన్నుల పసుపు, పసుపు ప్రాసెసింగ్ యంత్రాలు, డ్రమ్మింగ్ మిషనరీ పూర్తిగా దగ్ధమయ్యాయి. వీటి విలువ దాదాపు కోటి రూపాయలు ఉంటుందని బాధితుడు గోవింద్ చెప్పారు. మార్కెట్ యార్డు గొడౌన్‌కు కూడా నష్టం వాటిల్లింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని ఫైర్ అధికారులు భావిస్తున్నారు. వ్యాపారి నష్టపోవటమే కాకుండా పసుపు గ్రేడింగ్ పనులపై ఆధారపడ్డ 150 మంది మహిళలు, 25 మంది కళాసీలు ఉపాధి కోల్పోయారు. గోదాంలోని పసుపు పూర్తిగా దగ్ధమవడంతో వీరంతా రెండు నెలల పనిదినాలను కోల్పోయారు. గొడౌన్ దగ్ధమైన విషయాన్ని తెలుసుకున్న మహిళా కూలీలు పెద్ద ఎత్తున యార్డుకు చేరుకుని సహాయక చర్యల్లో పాలు పంచుకున్నారు.

విద్యా రంగం దీనావస్థపై నినదిద్దాం

- 7న ఎన్టీఆర్ యూనివర్సిటీ ముట్టడి
- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు హేమంత్‌కుమార్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు హేమంత్‌కుమార్

అనకాపల్లి: విద్యా రంగంలో సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 7న విజయవాడలో ఎన్టీఆర్ యూనివర్సిటీని ముట్టడించి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్‌కుమార్ తెలిపారు. జిల్లా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. విదేశాల్లో మెడిసిన్ చదువుకున్న రాష్ట్ర విద్యార్థులకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా విదేశీ విద్యా దీవెన అమలు చేశారని, ఇప్పుడు కూటమి పాలనలో ఈ పథకాన్ని ఎత్తివేయడం దారుణమన్నారు. విదేశాల్లో చదువుకుని వచ్చి ఎఫ్ఎంజీ పరీక్షల్లో క్వాలిఫై అయిన వీరి సేవలను కూటమి ప్రభుత్వం ఏడాది పాటు ప్రభుత్వ ఆస్పత్రిలో వినియోగించుకుని, తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వాపోయారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించిన మెడికల్ కళాశాలలను ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలన్నారు. కూటమి ప్రభుత్వం వీటిని ప్రభుత్వ – ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్వహిస్తామని చెప్పడం అన్యాయమన్నారు. మెడికల్ సీట్లు అమ్మకాలు చేసేందుకు ఇలా చేస్తున్నారని విమర్శించారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రైవేట్ విద్యా సంస్థలకు తొత్తుగా పని చేస్తున్నారని దుయ్యబట్టారు. పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ కళాశాలలను అభివృద్ధి చేయాలని కోరారు. దేశంలో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేస్తుంటే, రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన నడుస్తుందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో జిల్లా ఐటీ వింగ్ విభాగం అధ్యక్షుడు పల్లేలసాయి కిరణ్, విద్యార్థి విభాగం జిల్లా నాయకులు రాయి రాజా, కిల్లాడ శ్రీనివాసరావు, చదరం అప్పలనాయుడు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక సన్నిధిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు



నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

అనకాపల్లి: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ శుక్రవారం ఉత్తరాంధ్రుల ఇలవేల్పు నూకాంబిక అమ్మవారిని సతీసమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో కె.ఎల్.సుధారాణి అమ్మవారి చిత్రపటాన్ని మాధవ్‌కు అందజేశారు. అంతకుముందు గూడ్స్‌రోడ్డులోని ఇంద్రద్యుమ్న హాల్లో జగన్నాథస్వామిని మాధవ్ దంపతులు దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెద్దేరుకు వరద పోటు

- 300 క్యూసెక్కులు దిగువకు విడుదల

మాడుగుల: మండలంలోని పెద్దేరు జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు 200 క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో జలాశయం అధికారులు అప్రమత్తమై ఒక గేటు ద్వారా 300 క్యూసెక్కులు వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 136.45కు చేరింది. దీంతో జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టానికి నీరు చేరడం వల్ల వర్షాలు అధికమైతే ఏ సమయంలోనైనా వరద నీరు విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో మండలంలో పెద్దేరు ఏటి బాధితులు, సత్యవరం, వీరనారాయణ, పోతనపూడి, వీరవల్లి, జంపెన గ్రామాల రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు రమాదేవి హెచ్చరించారు.


సార్లు లేరు.. చదువుల్లేవు.!

అధ్యాపకుల్లేని కొరుప్రోలు జూనియర్ కళాశాల

8లో

తూర్పు తీరంలో పగడపు దిబ్బలు

- అంతర్జాతీయంగా అధికారిక గుర్తింపు
- ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ఆర్కైవ్స్‌లో ప్రచురణ
- చింతపల్లిలో అత్యధిక పగడపు దిబ్బలున్నట్టు గుర్తింపు
- పూడిమడక వద్ద ఉన్న పగడపు దిబ్బలను తరలించేందుకూ అవకాశం



విశాఖ సముద్ర గర్భంలో జీవ వైవిధ్యానికి ఈ జలచరాలే నిదర్శనం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

విశాఖ తీరంలోని పూడిమడక, రుషికొండ, మంగమారిపేట, విజయనగరం జిల్లా చింతపల్లి వద్ద అరుదైన పగడపు దిబ్బలు ఉన్నాయని అంతర్జాతీయంగా గుర్తింపు లభించింది. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ఆర్కైవ్స్‌లో ప్రచురితమైన 'డైవర్సిటీ అండ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ కోరల్ కమ్యూనిటీ ఫ్రం విశాఖపట్నం కోస్ట్, ఏపీ' అనే ఆర్టికల్‌లో ఈ విషయం స్పష్టమైంది. జూలై 1న ప్రచురితమైన ఈ నివేదిక, ఆంధ్రప్రదేశ్ తూర్పు తీరం కూడా పగడపు దిబ్బలకు నెలవుగా ఉందని తేటతెల్లం చేసింది. తద్వారా ఇప్పటివరకు పగడపు దిబ్బలు ఉన్నాయని పేర్కొంటూ వచ్చిన నివేదికలకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించిందని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) చేసిన సర్వేలో పాల్గొన్న లివిన్ అడ్వెంచర్స్ ఫౌండర్ బలరాం 'సాక్షి'కి తెలిపారు. ఇప్పటివరకు పగడపు దిబ్బలు భారతదేశంలో లక్షద్వీప్, అండమాన్-నికోబార్, గల్ఫ్ ఆఫ్ మన్నార్, గల్ఫ్ ఆఫ్ కచ్‌లకే పరిమితమని భావించేవారు. ఇందుకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు తీరం కూడా పగడపు దిబ్బలకు నెలవుగా ఉందని అంతర్జాతీయ తేటతెల్లమయింది.

2019 నుంచి 2023 వరకు...!

వాస్తవానికి పగడపు దిబ్బల ఉనికి కోసం డేటాను సేకరించేందుకు, పరిశోధన చేసేందుకు 2019 నుంచి 2023 వరకు విజయనగరం జిల్లాలోని చింతపల్లి నుంచి పూడిమడక వరకూ సర్వే చేశారు. మొత్తం 15 ప్రదేశాల్లో ఈ అధ్యయనం సాగింది. ఈ అధ్యయన నివేదికలు పలుమార్లు వెలువరించారు. అయితే అంతర్జాతీయ గుర్తింపు లభించడం ఇదే మొదటిసారి. తద్వారా ఆంధ్రా తీరం సముద్ర జీవ వైవిధ్యానికి నెలవుగా ఉందని అధికారికంగా గుర్తింపు లభించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. చింతపల్లి నుంచి పూడిమడక వరకు 15 ప్రదేశాల్లో జరిపిన అధ్యయనం సందర్భంగా సాగరగర్భంలో 30 మీటర్ల లోతుల వరకు అన్వేషణ సాగించారు. స్థానిక స్కూబా డైవింగ్ సంస్థ లివిన్ అడ్వెంచర్స్‌తో కూడిన నలుగురు శాస్త్రవేత్తల బృందం ఈ అధ్యయనాన్ని చేపట్టింది. పోరిటిడే, అగారిసిడె, డెండ్రోఫిలిడే వంటి అరుదైన పగడపు దిబ్బలున్నట్టు గుర్తించారు. వాస్తవానికి చింతపల్లి వద్ద 12 రకాల పగడపు దిబ్బలు, రుషికొండ వద్ద 6, పూడిమడక వద్ద 5, మంగమారిపేట వద్ద 3 రకాల పగడపు దిబ్బలు ఉన్నట్టు గుర్తించారు. చింతపల్లి వద్ద ఎక్కువగా పగడపు దిబ్బలు ఉన్నట్టు తెలుస్తోంది. అయితే, పూడిమడక వద్ద ఉన్న పగడపు దిబ్బల్లో కొంతభాగం తీసి మరో చోటికి తరలించి పెంచేందుకూ అవకాశం ఉందని తేలింది.

యాంటీ క్యాన్సర్ మందుల తయారీకి...!

సముద్ర గర్భంలో ఉండే ఈ పగడపు దిబ్బలు సముద్ర పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగమనే అభిప్రాయం ఉంది. పగడాల ద్వారా వచ్చే కాల్షియం కార్బోనేట్ వల్ల ఇవి ఏర్పడతాయి. వీటిలో కొన్ని పోషకాలు ఉంటాయి. ఈ పగడపు దిబ్బల ద్వారా సముద్రంలో ఉండే జీవరాశులు మరింతగా పెరిగేందుకు దోహదం చేస్తాయనేది శాస్త్రవేత్తల అభిప్రాయం. అంతేకాకుండా ఈ పగడపు దిబ్బలను యాంటీ బయోటిక్స్, యాంటీ క్యాన్సర్ వంటి మెడిసిన్స్ తయారీలోనూ ఉపయోగిస్తారని తెలుస్తోంది. అంతేకాకుండా సముద్రతీరం కోతకు గురికాకుండా సహజసిద్ధంగా ఇవి కాపాడతాయని కూడా అధ్యయనాల్లో తేలింది. మరోవైపు అలల తీవ్రతను కూడా తగ్గించేందుకు ఇవి దోహదం చేస్తాయి. ఈ నేపథ్యంలో వీటి పగడపు దిబ్బలను చూసేందుకు స్కూబా డైవింగ్, స్నోర్కెలింగ్ ద్వారా టూరిజం అభివృద్ధికి కూడా దోహదం చేస్తాయి.

అంతర్జాతీయంగా తొలిసారి గుర్తింపు



మన సముద్ర తీరంలో పగడపు దిబ్బలు ఉన్నట్టు గతంలో మేం జీఎస్ఐతో కలిపి జరిపిన అధ్యయనంలో తేలింది. అయితే, ఈ అధ్యయనానికి తొలిసారిగా ఈ నెల 1వ తేదీన ప్రచురణ ద్వారా అంతర్జాతీయ గుర్తింపు లభించింది. పగడపు దిబ్బల ద్వారా మత్స్యసంపదకు ఎంతో ఉపయోగం. కాలుష్యం బారిన పడకుండా వీటిని కాపాడుకోవాల్సిన అవసరం మాత్రం ఎంతో ఉంది.

– బలరాం, లివిన్ అడ్వెంచర్స్, ఫౌండర్

క్లుప్తంగా

అదనపు సిబ్బంది కోసం ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



ఆర్టీసీ డిపో వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా చేస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

అనకాపల్లి: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేయాలంటే తక్షణం సుమారు 1000 మంది సిబ్బందిని కొత్తగా నియమించాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డి.ఎల్.రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక డిపో గేటు వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని, పదోన్నతిలో జరుగుతున్న జాప్యంపై, 1/2019 సర్క్యులర్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, కొత్తగా 2500 బస్సులు కొనుగోలు చేయాలని కోరారు. సీసీఎస్ ఆఫీసు తరలింపు ఆపాలన్నారు. పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను అరియర్స్‌తో కలిసి చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి వై.వి.ఎస్.కుమార్, జిల్లా ఏపీ ఎన్జీవో అమరావతి మహిళా కార్యదర్శి కె.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో కుక్కల స్వైర విహారం





కుక్కల దాడిలో చనిపోయిన నాటు కోడి, (ఇన్‌సెట్) వీధి కుక్కల దాడిలో చిన్నారి కాలికి గాయం

దేవరాపల్లి: మండలంలోని నాగయ్యపేట పంచాయతీ శివారు సీతంపేటలో వీధి కుక్కలు శుక్రవారం స్వైర విహారం చేశాయి. చిన్నారులతో పాటు కోళ్లు, లేగదూడలపై సైతం దాడులు చేశాయి. వీటి దాడిలో గ్రామానికి చెందిన పుల్లి జామయ్య, కింతాడ చంటి నాటు కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఎలుసూరి బుజ్జి అనే చిన్నారి వీధి కుక్క దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధికారులు స్పందించి వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సార్లు లేరు.. చదువుల్లేవు.!

ఇంటర్ విద్య పూర్తి చేయాలనుకునే విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. బోధించే అధ్యాపకులు లేక చదువులు సాగడం లేదు. గతేడాది హైస్కూల్ ఉపాధ్యాయుల బోధనతో నెట్టుకొచ్చిన విద్యార్థులు.. ఈ ఏడాదీ అధ్యాపకులు కానరాకపోవడంపై ఆందోళన చెందుతున్నారు. భవిష్యత్తుపై బెంగతో టీసీలు ఇచ్చేయాలని వేడుకుంటున్నారు. ఇదీ ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో నడుస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరిస్థితి.



కళాశాలలో 20 మందికి ఇద్దరే హాజరైన ప్రథమ సంవత్సర విద్యార్థులు



లెక్చరర్ లేక కబుర్లు చెప్పకుంటున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థులు

- అధ్యాపకుల్లేని కొరుప్రోలు జూనియర్ కళాశాల
- గతేడాది హైస్కూల్ ఉపాధ్యాయుల బోధనే దిక్కు
- ఈ ఏడాదీ లెక్చరర్స్ నియామకంపై మీనమేషాలు
- విద్యార్థులకు తప్పని అవస్థలు



కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో నడుస్తున్న జూనియర్ కళాశాల

ఎస్.రాయవరం:

గత విద్యా సంవత్సరానికి ముందు మండలంలోని కొరుప్రోలు ఉన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం జూనియర్ కళాశాల మంజూరు చేసింది. మొదటి ఏడాది ఎంపీసీ, బైపీసీ కలిపి 51 మంది విద్యార్థులు జాయిన్ అయ్యారు. ఆ సమయంలో ఎన్నికలు రావడంతో తాత్కాలిక అధ్యాపకులను నియమించి మొదటి సంవత్సరం విద్యార్థులకు పాఠాలు బోధించారు. అప్పటి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పని చేసిన సకురు సత్యనారాయణ కృషి ఫలితంగా మొదటి సంవత్సరం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా చేశారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఒక్క అధ్యాపకుడిని కూడా నియమించలేదు. ఈ ఏడాది మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ కలిపి 20 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. వీరంతా రోజూ కళాశాలకు రావడం.. కబుర్లు చెప్పుకొని వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. మరోవైపు అధ్యాపకులు వస్తారని, కంగారు పడొద్దని హైస్కూల్ ఉపాధ్యాయులు చెబుతున్నారు.

టీసీల కోసం ఒత్తిడి

ఈ కళాశాలలో ఉంటే ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత సాధించడం కష్టమని పలువురు విద్యార్థులు టీసీలు ఇవ్వాలని కళాశాల నిర్వాహకులపై ఒత్తిడి చేస్తున్నారు. నెల రోజులుగా కళాశాలకు వచ్చినా ఒక పాఠం కూడా చెప్పకపోవడంతో పలువురు పూర్తిగా రావడం మానేశారు. మొదటి సంవత్సరం విద్యార్థులు ఇద్దరు మాత్రమే కళాశాలకు వచ్చి కూర్చుని వెళ్లిపోతున్నారు. విద్యార్థులకు 10వ తరగతి తరువాత అత్యంత కీలకం ఇంటర్మీడియట్ చదువు. అయితే కొరుప్రోలు కళాశాల విద్యార్థులు విద్యా బోధన ఈ ఏడాది కూడా గాల్లో దీపంలా తయారైంది.

ఈ సమస్యను ఉపాధ్యాయులు స్థానికంగా ఉన్న హోంమంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లారు. విద్యాశాఖ ఉన్నతాధికారులకు కూడా పరిస్థితిని వివరించారు. అయినా అధ్యాపకులను నియమించలేదు.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

రాష్ట్రంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మొదటి విడతలో ఏర్పాటైన కళాశాలలకు అధ్యాపకులు, సిబ్బందిని నియమించారు. ఎన్నికల ముందు రెండో విడతలో ఏర్పాటైన కళాశాలలకు తాత్కాలిక సిబ్బందిని కేటాయించారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఏడాదిన్నర దాటినా పూర్తి స్థాయిలో సిబ్బందిని, సదుపాయాలు కల్పించకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇతర కళాశాలల్లో ఇప్పటికే పలు పాఠ్యాంశాల బోధన పూర్తి చేశారు. కొరుప్రోలు కళాశాలలో మాత్రం ఒక్క పాఠం కూడా ప్రారంభం కాలేదు. ప్రస్తుతం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఖాళీ సమయాల్లో వచ్చి పాఠాలు చెబుతున్నారు. వారు కూడా పూర్తి స్థాయిలో బోధించేందుకు వీలు కుదరడం లేదు. ఇంటర్మీడియట్ కళాశాల అంటే ప్రత్యేక సిబ్బంది, వసతి సదుపాయాలు ఖచ్చితంగా ఉండాలి. కళాశాల ఏర్పాటై ఏడాది పూర్తయినా విద్యా శాఖ అటువంటి సౌకర్యాలు కల్పించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కళాశాలలో పూర్తి స్థాయి సిబ్బంది, భవనాలు ఏర్పాటు చేసి, సమగ్ర బోధన జరిగేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మరో కళాశాలలో జాయిన్ అవ్వక తప్పదు



నేను 10వ తరగతి చదివిన పాఠశాలలో జూనియర్ కళాశాల వచ్చిందని చాలా ఆనందంగా జాయిన్ అయ్యాను. మొదటి సంవత్సరం కూడా పూర్తి స్థాయిలో అధ్యాపకులు లేరు. హైస్కూల్ ఉపాధ్యాయుల బోధనతో నెట్టుకొచ్చాం. మొదటి సంవత్సరం పాస్ మార్కులతో ఉత్తీర్ణత సాధించాం. ద్వితీయ సంవత్సరం కళాశాల తెరిచి నెల రోజులైనా లెక్చరర్స్ రాలేదు. మా అమ్మ టీసీ తీసుకుని మరో కళాశాలలో జాయిన్ చేస్తామని చెప్పింది. కొత్త హెచ్ఎం సార్ కొన్ని రోజులు ఆగమన్నారు. లెక్చరర్స్ రాకపోతే మరో కళాశాలకు వెళ్లక తప్పదు.

– కె.మాన్విత, ద్వితీయ సంవత్సరం విద్యార్థి, కొరుప్రోలు కళాశాల

ఇలాగైతే ఉత్తీర్ణత సాధించడమే గగనం..



అందుబాటులో జూనియర్ కళాశాల ఉందని చాలా ఆనంద పడ్డాం. కళాశాల ఏర్పాటు నుంచి అధ్యాపకులు లేక ఉత్తీర్ణత సాధించడం గగనంగా మారింది. మంచి స్కోర్ తెచ్చుకుందామంటే మొదటి నుంచి బోధన లేదు. ప్రభుత్వ పెద్దలు ఆలోచించి తమకు పూర్తి స్థాయిలో అధ్యాపకులను నియమించాలి.

– ఎ.నీలావతి, ద్వితీయ సంవత్సరం విద్యార్థి, కోనవానిపాలెం, కొరుప్రోలు కళాశాల

నెల రోజులుగా విద్యార్థులను ఆపుతున్నాం..



కళాశాల ఏర్పాటుతో పాటు సిబ్బందిని, అధ్యాపకులను ప్రభుత్వం నియమించాలి. గతేడాది తాత్కాలికంగా నియమితులైన లెక్చరర్స్ ఈ ఏడాది కొనసాగేలా ఆదేశాలు విద్యా శాఖ నుంచి రాలేదు. ఈ ఏడాది కొత్తగా నియమిస్తారని ఎదురు చూస్తున్నాం. నెల రోజులుగా విద్యార్థులు మరో కళాశాలకు వెళ్లకుండా ఆపుతున్నాం. ఇప్పటికైనా అధ్యాపకులను నియమిస్తే పాఠాలు బోధన పూర్తి స్థాయిలో జరుగుతాది. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తాత్కాలికంగా చెప్పాలని సూచించాం. సమయం చాలడం లేదని చెబుతున్నారు. సమస్యపై అధికారులకు మరోమారు నివేదిస్తాం.

– కె.ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు, కొరుప్రోలు కళాశాల నిర్వాహకులు

మత్స్యకారుని గల్లంతుపై ప్రభుత్వం నిర్లక్ష్యం



పూడిమడక తీరంలో ఆందోళన చేస్తున్న మత్స్యకార నాయకులు, బాధిత కుటుంబీకులు

అచ్యుతాపురం రూరల్:

పూడిమడక గ్రామానికి చెందిన మత్స్యకారుడు చోడిపల్లి ఎర్రయ్య సముద్రంలో ప్రమాదవశాత్తు గల్లంతై మూడు రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ఎటువంటి గాలింపు చర్యలు చేపట్టలేదని మత్స్యకార సంఘాల నాయకులు, కుల పెద్దలు, బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం పూడిమడక సముద్ర తీరంలో మత్స్యకార నాయకులు, కుటుంబీకులు ఆందోళన చేశారు. మత్స్యకారులపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని వారు ఆరోపించారు.

ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఎటువంటి భరోసా రాకపోవడం అన్యాయమన్నారు. ప్రాణాలు పణంగా పెట్టి చేపల వేట సాగించే మత్స్యకారులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. ఇప్పటికైనా గల్లంతైన మత్స్యకారుని ఆచూకీ కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టకుంటే రాష్ట్ర మత్స్యకార సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

నావికా దళ సాయంతో గాలింపు

ఈ విషయమై ఎఫ్‌డీవో రవితేజను సాక్షి వివరణ కోరగా.. గురువారం ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. నావికా దళ సహాయంతో రాణి రాష్మోని, కనకలతా బారువా అనే రెండు షిప్‌ల సాయంతో సముద్రంలో గాలించామన్నారు. శనివారం జిల్లా మత్స్యశాఖ అధికారి విజయ బాధిత కుటుంబాన్ని పరామర్శించనున్నట్టు రవితేజ తెలిపారు. గల్లంతైన వ్యక్తి ఆచూకీ లేని సమయంలో మిస్సింగ్ ఫిర్యాదు ఆధారంగా త్రీమెన్ కమిటీ(ఆర్‌డీవో, డీఎస్పీ, ఏడీ ఫిషరీస్) ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని 3 నెలల వ్యవధిలో అందించనున్నట్టు ఎఫ్‌డీవో తెలిపారు. మత్స్యకారులు వేట సమయంలో లైఫ్ జాకెట్స్ తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు.

కూటమి పాలనలో మహిళలకు తప్పని వేధింపులు



ప్రిన్సిపాల్ అన్నపూర్ణను పరామర్శిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనకాపల్లి టౌన్: మహిళలను ఇబ్బందులకు గురిచేయడమే కూటమి ప్రభుత్వం సుపరిపాలనా? అని యూటీఎఫ్ సీనియర్ నాయకురాలు కోరెడ్ల విజయ గౌరీ ప్రశ్నించారు. చోడవరం ఎమ్మెల్యే, ఇతరుల వేధింపుల కారణంగా అస్వస్థతకు గురైన వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్ అన్నపూర్ణను యూటీఎఫ్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. స్థానిక శారదా కాలనీలో నివాసముంటున్న ఆమె ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విజయగౌరీ మాట్లాడుతూ వడ్డాది కేజీబీవీలో విద్యార్థుల చేరిక విషయంలో కూటమి నాయకుల గ్రూప్ తగాదాలు నేపథ్యంలో ప్రిన్సిపాల్‌ని ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఇందుకు కారణమైన చోడవరం ఎమ్మెల్యే, ఇతరులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ జేఏసీ నాయకుడు వి.వి.శ్రీనివాసరావు, యూటీఎఫ్ నాయకులు జి.కె.ఆర్.స్వామి, అలివేలు, హేమలత, సత్యవేణి, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి ఆశయ సాధనకు పాటుపడాలి



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అరకు ఎంపీ తనూజారాణి, బొడ్డేడ ప్రసాద్



అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహన్‌రావు



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్వో సత్యనారాయణరావు

- అరకు ఎంపీ తనూజారాణి పిలుపు

మునగపాక: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అరకు ఎంపీ జి.తనూజారాణి పిలుపునిచ్చారు. అల్లూరి జయంతిలో భాగంగా శుక్రవారం స్థానిక బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అల్లూరి చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్‌తో కలిసి ఆమె పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన అల్లూరి పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకమన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి చూపిన పోరాట ప్రతిభ మార్గదర్శకం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, బొడ్డేడ శ్రీనివాసరావు, భీశెట్టి గంగప్పలనాయుడు, మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరహా సత్యనారాయణ, పార్టీ నేతలు దాసరి అప్పారావు, నరాలశెట్టి సూర్యనారాయణ, పిన్నమరాజు రవీంద్రరాజు, ఆడారి రమణబాబు, జేసీబీ వెంకట్, కన్నంనాయుడు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి పోరాటం.. అద్భుత అధ్యాయం

అనకాపల్లి: అల్లూరి సీతారామరాజు చేసిన సాయుధ పోరాటం భారత స్వాతంత్ర్య చరిత్రలో అద్భుతమైన అధ్యాయంగా నిలిచిపోయిందని జిల్లా అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహన్‌రావు అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం విప్లవ యోధుడు అల్లూరి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారామరాజు జయంతి తెలుగు ప్రజలకే కాకుండా దేశం మొత్తం గర్వపడే రోజని కొనియాడారు. బ్రిటిష్ అధికారుల దమన, దౌర్జన్య విధానాలను ఎదిరిస్తూ, గిరిజనుల హక్కులను కాపాడేందుకు తన ప్రాణాలను అర్పించిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు టి.లక్ష్మి, లక్ష్మణమూర్తి, బెండి వెంకటరావు, రమేష్, గపూర్, ఎస్ఐలు సురేష్ బాబు, వెంకన్న, శిరీష, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తి యువతకు మార్గదర్శకం

తుమ్మపాల: అల్లూరి సీతారామరాజు త్యాగం, పోరాట పటిమ నేటి యువతకు మార్గదర్శకమని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు అన్నారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో అల్లూరి 128వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం పోరాడిన గొప్ప సమరయోధుడు అల్లూరి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేఆర్ఆర్‌సీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, జిల్లా పౌర సరఫరాల శాఖ డిపో మేనేజర్ పి.జయంతి, జిల్లా పరిషత్ కార్యనిర్వాహక ఇంజినీర్ వీరునాయుడు, కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి, భూపరిపాలన, సమన్వయ, మేజిస్ట్రియల్ విభాగాలకు చెందిన పర్యవేక్షకులు విజయ్‌కుమార్, పి.వి. రత్నం, ఎస్ఎస్‌వీఎస్ నాయుడు, రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

విశాఖ లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని అన్ని న్యాయ స్థానాలు, మండల న్యాయ సేవా సంఘాలు(భీమిలి, గాజువాక, అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి, చోడవరం, మాడుగుల, అరకు, చింతపల్లి, పాడేరు)లో లోక్ అదాలత్ జరగనుందని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 4,710 కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలో మొత్తం 37 బెంచ్‌లను అన్ని కోర్టుల సముదాయాల్లో ఏర్పాటు చేశారు. సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక వివాదాలు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు మినహా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూచించారు.

బోర్డు సమావేశంలో పలు అంశాలకు ఆమోదం



బోర్డు సమావేశంలో వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: వీఎంఆర్డీఏ బోర్డు సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సంస్థ చైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిషనర్ విశ్వనాథన్‌తో పాటు బోర్డు సభ్యులు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఇందులో పలు అంశాలకు బోర్డు ఆమోద ముద్ర వేసింది. మధురవాడ, మిథిలాపురి కాలనీ, మారికవలస, వేపగుంట, ఇతర ప్రాంతాల్లో పీపీపీ విధానంలో అపార్టుమెంట్ల నిర్మాణాలకు ఆమోదించింది.

- అనకాపల్లి జిల్లా కొత్తూరు గ్రామం సర్వే నెంబర్ 608/1పీలో ఉన్న 5.68 ఎకరాల విస్తీర్ణంలో రూ 5.35 కోట్ల వ్యయంతో పిల్లల కోసం సిటీ లెవెల్ పార్క్ నిర్మాణానికి ఆమోదించింది. ఇందులో ఆట స్థలం, యోగా చేసుకునేందుకు యోగా ముద్ర విగ్రహాలతో కూడిన నిర్దేశిత ప్రదేశం, జిమ్ పరికరాలు, యాంఫీ థియేటర్, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్, ఫుట్‌బాల్ కోర్టులు, స్కేటింగ్ రింక్, ఇతర సదుపాయాలు ఉండనున్నాయి.
- వేపగుంట–పినగాడి బృహత్తర ప్రణాళిక రహదారి అభివృద్ధికి పరిపాలన అనుమతులు మంజూరు చేశారు.
- బీచ్ రోడ్‌లోని వీఎంఆర్డీఏ పార్కులో రూ 2.50 కోట్లతో ప్రస్తుతమున్న స్కేటింగ్ రింక్ పక్కనే 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ క్రీడా పోటీల నిర్వహణకు, అంతర్జాతీయ పోటీలకు అనువుగా రాష్ట్రంలోనే మొట్ట మొదటి స్కేట్ బోర్డ్ పార్క్ నిర్మాణానికి ఆమోద ముద్ర వేశారు.

మరుక్షణం మరిచారు

నిరుద్యోగులకు స్వయం ఉపాధి కోసం లక్ష రూపాయల లోపు రుణాలను వడ్డీ లేకుండా బ్యాంకుల ద్వారా ఏర్పాటు చేయిస్తామని సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆర్భాటంగా ప్రకటించిన సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారు. నిరుద్యోగులకు కార్పొరేషన్ రుణాలు ఇంటర్వ్యూలు నిర్వహించి ఐదు నెలలు కావస్తోంది. ప్రభుత్వ సబ్సిడీ నిధులు విడుదల చేయకపోవడంతో బ్యాంకర్ల వాటాగా రుణాలు ఇవ్వడానికి ససేమిరా అంటున్నారు. దాంతో నిరుద్యోగులు ఆశగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు.

- కార్పొరేషన్ రుణాలకు ఆర్భాటంగా ఇంటర్వ్యూలు
- సబ్సిడీ జమ చేయని కూటమి సర్కార్
- రుణాలిచ్చేందుకు ససేమిరా అంటున్న బ్యాంకర్లు
- బ్యాంకుల చుట్టూ నిరుద్యోగుల ప్రదక్షిణలు

తుమ్మపాల: కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటం తప్ప ఏ ఒక్క పథకాన్ని సక్రమంగా అమలు చేయడం లేదు. ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాల పరిస్థితి మరింత దారుణం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ రుణాలు మంజూరు పేరుతో నాలుగు నెలల క్రితం హడావుడి చేసిన ప్రభుత్వ పెద్దలు, అధికారులు ఆచరణలో ఘోరంగా విఫలమయ్యారు. ఫిబ్రవరి, మార్చి నెలలో దరఖాస్తులు స్వీకరించి, ఇంటర్వ్యూలు నిర్వహించి ఐదు నెలలు పూర్తయినా నేటికి రుణాలు ఊసెత్తలేదు. నిరుద్యోగులు కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా ఫలితం లేకుండా పోతోంది.

• అభ్యర్థుల ఆశలు అడియాశలేనా?

ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసి నిర్వహించిన ఇంటర్వ్యూలు హుళక్కేనా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూల ప్రక్రియ ముగిసిన తర్వాత కొద్ది రోజులకే మండల పరిషత్ కార్యాలయాల సిబ్బంది అర్హుల జాబితా సిద్ధం చేసి బ్యాంకర్లకు పంపించారు. లబ్ధిదారుల ఖాతాలో సబ్సిడీ జమ అయితే కానీ రుణాలు మంజూరు చేయని పరిస్థితిలో బ్యాంకర్లు ఉన్నట్లు **తెలుస్తోంది. నిధులు** లేని కారణంగా**నే ప్రభుత్వం** సబ్సిడీ ఇవ్వడం**లో జాప్యం** చేస్తుందని **పలువురు** వాపోతున్నారు. కూటమి ప్రభు**త్వ** పెద్దలు ఏ**దో** చేస్తామని భ్రమ**లు** కల్పించడం **తప్ప** ఏపీ ఆచరణ**కు** నోచుకోవడం **లేద**ని, కార్పొరే**షన్** రుణాల మం**జూరు** కూడా అంతేనన్న **విమ**ర్శలు వినిపిస్తున్నా**యి.**

• సిఫార్సు ఉంటేనే..

కూటమి ప్రభు**త్వ పెద్దల సిఫార్సులు ఉన్న** వారికే బ్యాంకర్లు రుణాలు ఇవ్వనున్నట్టు ప్రచారం జోరుగా సాగుతోంది. ఇందులో భాగంగా నాయకులు తమ అనుయాయుల పేర్లతో జాబితా తయారు చేసి **బ్యాంకర్లకు అందజేసిన**ట్లు చర్చ జరు**గుతోంది. విమ**ర్శలు వస్తా**యనే ఉద్దే**శంతో దరఖా**స్తులు** స్వీకరించి **తూతూ**మంత్రం**గా** ఇంట**ర్వ్యూలు** నిర్వ**హించారనే ఆరోపణలు** వినిపిస్తు**న్నాయి.** దీంతో **కొందరు** అభ్య**ర్థులు** రుణాలపై **ఆశలు** వదులుకు**న్నారు. మరి**కొందరు ఇం**టర్వ్యూలు ముగిసి**నప్పటి నుం**చి తమకు సబ్సిడీ రుణా**లు ఎప్పుడు వస్తాయా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఉన్నత చదువులు చదివి ఖాళీగా ఉన్న యువతకు ప్రాముఖ్యత ఇచ్చి స్వయం ఉపాధి పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

• ఐదు నెలలుగా ఎదురుచూపులు..

ప్రభుత్వం కార్పొరేషన్ల పరిధిలో కులాల ప్రాతిపదికన సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంతో అందరి చూపు రుణాలపై పడింది. రుణాల్లో బ్యాంకర్ల వాటా, ప్రభుత్వ సబ్సిడీ ఉంటుంది. దరఖాస్తుదారులకు వచ్చిన మొత్తంతో ఏదైనా వ్యాపారమో.. లేక చిన్న పరిశ్రమ పెట్టుకుని జీవనం సాగించవచ్చని నిరుద్యోగులు భావించారు. నెలలు గడుస్తున్నా రుణాల మంజూరు గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో వీరంతా దిగాలుగా ఉన్నారు. అభ్యర్థులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎవరూ సరైన సమాధానం చెప్పకపోవడంతో క్రమంగా ఆశలు వదులుకుంటున్నారు.

• 800 దరఖాస్తులకు 78 రుణ యూనిట్లే మంజూరు

మండలంలో 32 గ్రామ పంచాయతీలకు గాను కేవలం 78 రుణ యూనిట్లు మాత్రమే కూటమి ప్రభుత్వం మంజూరు చేసినప్పటికి హంగులు, ఆర్భాటాలతో అధికార పార్టీ నాయకులు విస్తృత ప్రచారం చేయడంతో మండలంలో నిరుద్యోగులు నుంచి 800 దరఖాస్తు వచ్చాయి. వారందరికి హడావుడిగా ఇంటర్వ్యూలు నిర్వ**హించి చేతులు దులుపుకున్నారు.**



కార్పొరేషన్ రుణాల మంజూరుకు హడావుడిగా నిర్వహించిన ఇంటర్వ్యూలు (ఫైల్)

బ్యాంకులకు అర్హుల జాబితా పంపించాం



కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు ముగిసిన వెంటనే అర్హుల జాబితాను సిద్ధం చేసి అన్ని బ్యాంకులకు పంపించాం. బ్యాంకులు, ప్రభుత్వానికి సంబంధించిన ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం లబ్ధిదారులకు సబ్సిడీ రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఆశాజ్యోతి, ఎంపీడీవో, అనకాపల్లి మండలం

క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

కశింకోట: ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ పరిధిలోని కశింకోట, మునగపాక మండలాల్లో ఈ నెల 6న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. సింహాద్రి–గాజువాక–2 విద్యుత్ లైన్ ఎర్త్ వైర్‌ను పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో మార్పు చేయనుందన్నారు. దీని వల్ల డివిజన్ పరిధిలోని కశింకోట మండలం నరసింగబిల్లి 132 కె.వి. 33/11 కె.వి. విద్యుత్ కేంద్రాలు, మునగపాక మండలంలోని చూచుకొండ విద్యుత్ కేంద్రం పరిధిలోను లోడ్‌ను తాత్కాలికంగా నిలిపి వేయనున్నారన్నారు. కశింకోట, మునగపాక మండలాల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఆ రోజు ఉదయం 4 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తారన్నారు. అత్యవసర సమయంలో లోడ్ రిలీఫ్ ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గుర్తించి సహకరించాలని కోరారు.

స్మార్ట్ మీటర్లపై మాట మార్చిన కూటమి నేతలు

అనకాపల్లి టౌన్: ఇళ్లకు బిగిస్తున్న స్మార్ట్ మీటర్ల వల్ల వినియోగదారులకు ఎటువంటి ప్రయోజనం లేదని జిల్లా ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు చిన్నియాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్మార్ట్ మీటర్లు పెట్టుకోకపోతే విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామని అబద్ధాలు చెబుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన కూటమి నాయకులు ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాసి ప్రజలపై బలవంతంగా అదనపు భారాన్ని రుద్దుతున్నారన్నారు. తక్షణమే స్మార్ట్ మీటర్ల బిగింపు చర్యలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

9న కార్మికుల దేశ వ్యాప్త సమ్మె



ఎంఈవో మూర్తికి వినతి పత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

కశింకోట: కార్మికుల దేశ వ్యాప్త సమ్మె ఈ నెల 9న జరగనుందని, దీనిల్లో పాల్గొననున్న దృష్ట్యా మధ్యాహ్న భోజన పథకం కార్మికులు శుక్రవారం ఎంఈవో–2 కెఎస్ఎన్ మూర్తికి సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఎండీఎం యూనియన్ అధ్యక్షురాలు ఎం. శ్రీదేవి, కార్యదర్శి బి. సూర్యలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ను తక్షణమే రద్దు చేయాలన్నారు. ఈ మేరకు దేశ వ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎండీఎం ప్రతినిధులు వి. సత్యవతి, అచ్చయ్యమ్మ, డి. నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి మోహనరంగాకు ఘన నివాళి



వంగవీటి జయంతి వేడుకల్లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు

కశింకోట: మండలంలోని బయ్యవరంలో శుక్రవారం రాత్రి కాపుల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వంగవీటి రంగా యూత్ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగ సత్యనారాయణ, స్థానిక నాయకులు గొల్లవిల్లి నానాజీ, నార్ని శ్రీనివాసరావు, గొల్లవిల్లి వెంకటేశ్వరరావు, గుమ్మాల మాణిక్యం పాల్గొన్నారు.

ఎల్ఐసీ రిటైర్డ్ ఉద్యోగుల నిరసన



ప్లకార్డులతో నిరసన చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

అనకాపల్లి: ఎల్ఐసీలో విధులు నిర్వహించి 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న విశ్రాంత ఉద్యోగులకు పూర్తిస్థాయి పెన్షన్ ఇవ్వాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధి శాస్త్రి డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక శారదానగర్ ఎల్ఐసీ కార్యాలయం వద్ద రిటైర్డ్ ఉద్యోగులు ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌పీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని, 20 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసిన వారికి ఫుల్ పెన్షన్ అర్హత కల్పించాలని తదితర డిమాండ్లతో ధర్నా చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నేడు

విజయవంతం చేయాలని భరత్‌కుమార్ పిలుపు



మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం 3 గంటలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డులో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో ముఖ్య నేతలతో శుక్రవారం భరత్‌కుమార్ సమీక్షించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ అనే నినాదంతో నియోజకర్గంలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు ఏడాదిలో ఏ మేరకు అందాయే ఆరా తీసి ప్రజలు పక్షాన పోరాటాలు చేస్తామన్నారు. తల్లికి వందనం పథకం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, మోసపూరిత హామీలతో గద్దె నెక్కిన కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పేరోజులు ఆసన్నమైందన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో పేదలకు ఏడాదికి రూ.లక్షలు డీబీటీ పద్ధతి ద్వారా అందేదన్నారు. పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, జెడ్పీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, కశింకోట జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జాజుల రమేష్, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, కశింకోట ఎంపీపీ కలగ లక్ష్మి గున్నయ్యనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు బొడ్డేడ శివ, కొణతాల మురళీకృష్ణ, ముమ్మిన గణేష్, నీటిపల్లి లక్ష్మి, మరిపల్లి శోభ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణులకు మరింత మెరుగైన సేవలు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హైమావతి



కశింకోట పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హైమావతి



బయ్యవరం ఫౌండేషన్ స్కూలులో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

కశింకోట: గ్రామీణులకు మరింత మెరుగైన సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హైమావతి ఆదేశించారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు, కేంద్ర పరిసరాలను తనిఖీ చేశారు. వైద్య, ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. పీహెచ్‌సీలో ప్రసవాలు పెంచాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడానికి కృషి చేయాలన్నారు. కేంద్ర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి తిరుపతిరావు, ఆరోగ్య విస్తరణాధికారి సీహెచ్. సత్యనారాయణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం బయ్యవరంలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై ఏఎన్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో రోగులకు విరివిగా సేవలించాలన్నారు. అక్కడి ఫౌండేషన్ స్కూలును సందర్శించి విద్యార్థుల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.


మెడిసిన్ విద్యార్థులపై కూటమి వేధింపులు



జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ సిద్ధార్థ

అనకాపల్లి: విదేశాల్లో మెడికల్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులపై పోలీసులతో కూటమి ప్రభుత్వం దాడులు చేయడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ డి.డి.ఎస్. ఎస్ సిద్ధార్థ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్ఎంసీ గైడ్‌లైన్స్ మేరకు వాళ్లంతా ఇక్కడ ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేషన్ (ఎఫ్ఎంజీ) ఎగ్జామ్‌లో ఉత్తీర్ణులైన తర్వాత, ఇక్కడే ఇంటర్న్‌షిప్ పూర్తి చేసినా, పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నంబర్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపితే వారిపై పోలీసులతో దాడులు చేయించడం అన్యాయమన్నారు. ఏడాదిగా ఇంటర్న్‌షిప్ పేరుతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ, ప్రైవేటు మెడికల్ కాలేజీలకు మేలు చేకూర్చేలా వీరికి పర్మినెంట్ రిజిస్ట్రేషన్ (పీఆర్) నంబర్ ఇవ్వకపోవడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. తమ పిల్లలను డాక్టర్లుగా చూడాలని తల్లిదండ్రులు అప్పులు చేసి, ఆస్తులు అమ్మి విదేశాలకు పంపించి చదివిస్తే, అలాంటి వారి కెరీర్‌ను నాశనం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. విదేశీలో మెడికల్ చదివిని వారిపై పోలీసుల దమనకాండను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలపై ఆరా



తాళ్లపాలెంలో సంపద కేంద్రాన్ని సందర్శిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో వెంకట తోటారావు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం, కన్నూరుపాలెం, సుందరయ్యపేట గ్రామాల్లో డిప్యూటీ ఎంపీడీవో వెంకట తోటరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్యక్రమాలు, మంచి నీటి సరఫరా నిర్వహణ తీరుపై పరిశీలించారు. దీని అమలుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాళ్లపాలెంలో సంపద కేంద్రాన్ని, మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. వాటి నిర్వహణ తీరు గురించి ఆరా తీశారు. కన్నూరుపాలెంలో పాడుబడిన చెరువును బాగు చేసి దానిలో నిర్మించిన శివాలయం, వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు ఎస్. సత్యారావు, జి. అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

కశింకోట: స్థానిక గ్రామీణ వికాస బ్యాంకు వద్ద శుక్రవారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి పురస్కరించుకొని నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఉత్సాహంగా పలువురు యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాన ప్రాధాన్యతను వక్తలు వివరించారు. సూర్య ఆంజనేయ బ్లడ్ బ్యాంకు, వందే భారత్ బ్లడ్ బ్యాంకుల సిబ్బంది వచ్చి రక్తాన్ని సేకరించారు.

అల్లూరి ఆశయ సాధనకు కృషి

• వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్



గూడ్స్‌రోడ్డు జంక్షన్‌లో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న భరత్‌కుమార్



గూడ్స్ రోడ్ వద్ద అల్లూరి విగ్రహం వద్ద క్షత్రియ సంక్షేమ సంఘం నాయకులు



సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ నాయకులు



కశింకోటలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న సీపీఎం నాయకుడు శ్రీనివాసరావు



అల్లూరికి అధికారులు, సిబ్బంది నివాళులు



కశింకోటలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు

అనకాపల్లి: బ్రిటిష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. శుక్రవారం స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ రహదారి గూడ్స్‌షెడ్ అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకూ పాదయాత్ర నిర్వహించారు. అక్కడ సీతారామరాజు 128వ జయంతి పురస్కరించుకుని పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పాటు చేసి గిరిజనులకు ఇచ్చిన హామీ నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కె.పద్మకుమారి, కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మలసాల కుమార్ రాజా, 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, పార్టీ సీనియర్ నాయకులు విల్లూరి చంద్రశేఖర్, దాడి నారాయణరావు, కొణతాల మురళీకృష్ణ, ఉగ్గిన అప్పారావు, మూనూరు శ్రీనివాసరావు, కోన ఉమ, జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్: పట్టణంలో మన్యం వీరుడు విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. గూడ్స్‌రోడ్ వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి రాజపుత్ర సమాజ్ ఆధ్వర్యంలో పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్షత్రియ సంక్షేమ సంఘం నాయకుడు మందపాటి జానకీరామరాజు మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల దౌర్జన్యాలను ఎదురొడ్డి, గిరిజనుల హక్కులను కాపాడేందుకు తన ప్రాణాలను పణంగా పెట్టిన మహనీయుడని కొనియాడారు. దంతులూరి దిలీప్ కుమార్ మాట్లాడుతూ తన చివరి శ్వాస వరకు ప్రజల హక్కుల కోసం పోరాడిన నేత అల్లూరి సీతారామరాజన్నారు. కార్యక్రమంలో క్షత్రియ సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణాలర్పించిన నేత అల్లూరి అని అన్నారు. కార్యక్రమంలో జి ఫణీంద్రకుమార్, వియ్యపు రాజు, కోరిబిల్లి శంకరావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: బీజేపీ ఆధ్వర్యంలో సంతబయలలో విప్లవ వీరుడు అల్లూరి జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విప్లవ వీరుడు అల్లూరి దేశ స్వాతంత్ర్య సముపార్జనకు తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యాగం చేశారని శ్లాఘించారు. నాయకులు శిష్టి అప్పారావు, నడిపల్లి సన్యాసిరావు, కలవలపల్లి రాజారావు, ప్రగడ నూకరాజు తదితరులు పాల్గొన్నారు. సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన జయంతి కార్యక్రమంలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి. వరలక్ష్మి, ప్రజా సంఘాల ప్రతినిధులు బి. సూర్యలక్ష్మి, నూకరత్నం, లక్ష్మి, సత్యవతి, పూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో..

ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ కార్యాలయంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇంజనీర్లు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు సీనియర్ సిటిజన్స్ సమావేశం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గవరపాలెం వి.వి. రమణ రైతు భారతి హాల్‌లో శనివారం ఉదయం 10 గంటలకు సీనియర్ సిటిజన్స్ సమావేశం నిర్వహించనున్నట్టు జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ సిటిజన్స్‌కు గుర్తింపు కార్డులు ఉచితంగా అందజేస్తామన్నారు. 70 సంవత్సరాలు కలిగిన స్త్రీ, పురుషులందరికీ సత్కారం చేస్తామని తెలిపారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

అనకాపల్లి: వ్యవసాయశాఖ రెవెన్యూ డివిజన్ పరిధిలో కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్నట్టు వ్యవసాయ సహాయ సంచాలకుడు ఈఏ సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం మేడపైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌలుకు వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతు కౌలు గుర్తింపు కార్డు పొందాలన్నారు. దీనివల్ల వ్యవసాయ శాఖ ద్వారా రాయితీలు, విత్తనాలు, ఎరువులు పొందవచ్చన్నారు. ఏవో పి. రంగాచారి మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డులు, ఈ– పంట నమూనా గ్రామాల్లో పూర్తి చేయాలని తెలిపారు. డీటీ కుమారస్వామి, ఆత్మ ఏటీఎం పి. రామకృష్ణ, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అనకాపల్లి టౌన్: ప్రకృతి వ్యవసాయంతో అనేక లాభాలున్నాయని, ఎరువులు, పురుగుల మందుల వాడకం తగ్గితే మనుషులు ఆరోగ్యంగా ఉంటారని వ్యవసాయ శాఖ మార్కెటింగ్ ఇన్‌చార్జ్ సిరసపల్లి అప్పలరాజు తెలిపారు. మండలంలోని దిబ్బపాలెంలో ప్రకృతి వ్యవసాయం విధానంలో బీజామృతంతో విత్తన శుద్ధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకోవడం వల్ల వరినారుకు ఎటువంటి తెగుళ్లు సోకవన్నారు. పంట కూడా ఆరోగ్యంగా ఏపుగా పెరుగుతుందన్నారు. ఏపుగా ఎదిగిన నవధ్యానాలను దమ్ము సమయంలో పొలంలో కలియదున్నుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది నాగేశ్వరరావు, వీరనాయుడు, మహలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.